క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అర్హులందరికీ అందాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. ముగ్గళ్ల ఎస్సీపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. అక్కడ పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, సరకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత కలగకుండా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఆయా చిన్నారి పాల్గొన్నారు.

బాలికా విద్యపై అవగాహన

బిక్కవోలు: మెళ్లూరులోని ఉన్నత పాఠశాల వద్ద బేటీ బచావో.. బేటీ పడావోపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి గౌరి మాట్లాడుతూ బాలికా విద్య ఆవశ్యకతను వివరించారు. ఉన్నత విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. హెచ్ఎం బీవీఎల్ఎస్ మూర్తి, ఉపాధ్యాయురాలు కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థి చైతన్యను అభినందిస్తున్న హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు

అనపర్తి: రాష్ట్ర స్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో పీరారామచంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ముప్పిడి చైతన్య ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం వి.రమణ తెలిపారు. గత నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చైతన్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రీడాకారుల్లో 3వ స్థానంలో నిలిచారన్నారు. గురువారం పాఠశాలలో ఆ విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ జి.దేవి రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


98 శాతం పింఛన్ల పంపిణీ



చంద్రేడులో లబ్ధిదారుడికి పింఛను సొమ్ము అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ జానీ

రంగంపేట: మండలంలో ఇప్పటి వరకూ 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఒకటో తేదీ నుంచి పింఛన్ల పంపిణీని వలంటీర్లు, గృహ సారథులు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సొమ్ము అందించారు. మండలంలో మొత్తం 8,966 మంది లబ్ధిదారులుండగా సుమారు రూ. 2.46 కోట్లు అందజేస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులో లేనివారికి శుక్ర, శనివారాల్లో పింఛన్ అందించి నూరు శాతం పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

దంత సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



రామేశ్వరంలో చిన్నారులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: దంత సమస్యలను అశ్రద్ధ చేయరాదని కాకినాడ శ్రీసూర్యచంద్ర దంత ఆసుపత్రి వైద్యులు సలాది సూర్యకమల, జేసీఐ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రవితేజ అన్నారు. రామేశ్వరం గ్రామంలో గురువారం శ్రీసూర్యచంద్ర దంత ఆసుపత్రి, జేసీఐ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మందికి దంత వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు శివ, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: కాపవరం గ్రామంలో తన అత్తయ్యకు ఐదు సెంట్ల భూమి ఉందని వీధి సోలోమన్‌రాజు పేర్కొన్నారు. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన పలివెల జార్జి, కొమనాపల్లి అర్జమ్మ, పలివెల పండు, పలివెల భారతీరాజాలు రేకుల షెడ్డు వేసేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి గాయపరిచారని సోలోమన్‌రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులకు మహర్దశ



కోరుకొండ మండలం జంబూపట్నంలోని బలరామయ్య చెరువు



రాజానగరం మండలం నందరాడలోని అడుసుమిల్లి వెంకయ్య చెరువు

- నియోజకవర్గంలో 25 మైనర్ ఇరిగేషన్, 70 చిన్న చెరువులు
- ఏడాదికి 4,500 టన్నుల చేపల ఉత్పత్తి
- మూడు వేల మత్స్యకార కుటుంబాలకు ఉపాధి

మధురపూడి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చెరువులకు మహర్దశ పట్టింది. చేపల పెంపకానికి అవి అనుకూలంగా మారాయి. అలాగే రబీ సీజన్‌లో సాగునీటిని పుష్కలంగా అందించడానికి వీలు కలిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో వ్యవహరించడంతో చెరువులు అభివృద్ధి చెందాయి. నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 1,727 ఎకరాల విస్తీర్ణంలో 25 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. అలాగే సాగునీరందించే 70 చిన్న చెరువులు కూడా ఉన్నాయి. 32 మత్స్య సహకార సంఘాలకు చెందిన మూడు వేల కుటుంబాలు చేపల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్నాయి. ఏటా ఈ చెరువుల ద్వారా 4,500 టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. ఇటీవల చెరువులను శుభ్రపరిచారు. గట్లను పటిష్టం చేశారు. తద్వారా ఆహ్లాదకరమైన వాతావరణాన్నిచ్చేలా చెరువులున్నాయి, పార్కుల తరహాలో తీర్చిదిద్దబడ్డాయి. స్థానికులకు సేదతీరే వీలు కలిగింది. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గం చేపల పెంపకంలో ముందంజలో ఉంది. మేలు రకాల చేపలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. అలాగే మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కలుగుతోంది.

ఆదాయ వనరు



చేపల పెంపకం ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉంది. రాజానగరం నియోజకవర్గంలోని 25 చెరువుల ద్వారా ఏటా 4,500 టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. దీనిద్వారా మత్స్యకారులు ఆదాయం పొందుతున్నారు. చేపలను మార్కెటింగ్ చేయడంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. చేపల పెంపకంలో మెలకువలు తెలిపారు.

– వి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖాధికారి, రాజమహేంద్రవరం

లాభదాయకం



చెరువుల్లో చేపల పెంపకం లాభదాయకంగా ఉంది. మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలో ప్రజలకు ఉపాధి వనరుగా ఉంది. చెరువుల్లో మేలు రకమైన చేపలను పెంచడంతో వినియోగదారులకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతోంది. ప్రభుత్వం ప్రోత్సాహంతో చెరువులు పెరిగాయి.

– మద్దాల చంటిబాబు, బుచ్చెంపేట

416 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



గోకవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోకవరం: క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను 30 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు విధిగా చేయించుకోవాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రభ సూచించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో గురువారం రాజమహేంద్రవరం మెడికల్ కళాశాల యాజమాన్యం సహకారంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. మండలంలోని సుమారు 416 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 49 మందిని క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వనజా కుమారి, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి డాక్టర్ రవిచంద్ర, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సీహెచ్ఓ మేరీకృప, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన



వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, కె.ప్రత్యూష కుమారి గురువారం నగరంలోని సంక్షేమ హాస్టళ్లను పరిశీలించారు. ఈ మేరకు కేవీ స్టేట్ హోమ్ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలపాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న వారికి మంచి పౌష్టికాహారం అందజేయాలని, విద్యార్థులకు అందించాల్సిన సౌకర్యాలలో లోటుపాట్లు ఉండకూడదని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాల సదనం సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించి అక్కడ పిల్లలకు అందుతున్న ఆహారం, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటు

కె.గంగవరం: జగనన్న భూరక్ష పథకంలో భాగంగా భూ రీసర్వే పనులను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ ఆదేశించారు. మండలంలోని పాణింగపల్లి, అముజూరు గ్రామాల్లో సరిహద్దు సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలకు సర్వే రాళ్లు వచ్చాయన్నారు. వీటిని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది నిబంధనల ప్రకారం సూచించిన చోట ఏర్పాటు చేస్తారని చెప్పారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా ప్రజలు ఎక్కువగా వస్తువులు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని నేరగాళ్లు మనం ఆర్డర్ పెట్టని వస్తువులు ఇంటికి తీసుకువచ్చి, మనది కాదని చెప్పగానే ఆర్డర్ కేన్సిల్ చేస్తున్నామని మీ ఫోన్‌కి ఓటీపీ నంబరు వస్తుందని చెప్పమని అడుగుతున్నారన్నారు. సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగానే మన బ్యాంక్ ఖాతాలలో సొమ్ము మాయమవుతుందన్నారు. ఏ సమయంలోనైనా సెల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీ నంబర్లు బయటకు చెప్పే విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

బేటీ బచావో.. బేటీ పఢావో ర్యాలీ



నాగంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సీతానగరం: మండలంలోని నాగంపల్లిలో గురువారం బేటీ బచావో.. బేటీ పఢావో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను కాపాడుకుందా, ఆడపిల్లలను చదివిద్దాం అని నినాదాలు చేశారు. డాక్టర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. నేటి ఆడపిల్ల రేపటి అమ్మ అని, ఈ రోజు మనం ఆడపిల్లను వద్దనుకుంటే రేపు మన సమాజం అమ్మలేని అనాథవుతుందన్నారు. ఆడపిల్లలను చదివిద్దా, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుందరి, ఏఎన్ఎం శిరోమణి, ఎస్.లక్ష్మి, ఆశవర్కర్లు నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

- సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆడపిల్లలను రక్షించు, ఆడపిల్లలను చదివించు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ హైస్కూల్ పీడీ తమ్మారావు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సీహెచ్ఓ స్వరూప, సూపర్‌వైజర్ దైవకృప, హెల్త్ అసిస్టెంట్ నందీశ్వరరావు, ఏఎన్ఎంలు సలీమా, మున్నీషా, సంధ్య పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ఉత్సాహంగా స్నాతకోత్సవం



ఛాత్రోపాధ్యాయులతో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో గురువారం డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) 2019–21 బ్యాచ్ స్నాతకోత్సవం ఉత్సాహంగా జరిగింది. దీనిలో భాగంగా 43 కేటగిరీల్లో టాపర్లుగా నిలిచిన 34 మందికి నగదు బహుమతులు, ముగ్గురికి ఉత్తమ నిర్వహణ నైపుణ్యాల అవార్డులు, ఒకరికి ఉత్తమ సాంకేతిక నైపుణ్య అవార్డును ప్రిన్సిపాల్ ఎన్ఆర్ సుబ్రహ్మణ్యం అందజేశారు. నగదు బహుమతులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు కొమ్ముల వెంకట సూర్యనారాయణ, కె.గంగాధరరావు, డీఎస్వీ సత్యనారాయణ, డి.సుజాతారత్న, ఎం.జానకీదేవి, ఎన్.ఎస్తేర్, జే.కళావతి, అధ్యాపకేతర సిబ్బంది, వారి తల్లిదండ్రులు పేర్లు మీదుగా టాపర్లకు ప్రదానం చేశారు. సుమారు 60 మంది 2019–21 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎన్.ఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బోధనాపరంగా ఇక్కడితో తమతో అనుబంధం తీరిపోయినట్లు భావించవద్దన్నారు. తమ సిబ్బంది సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. అధ్యాపకుడు కొమ్ముల వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ మొదటిసారిగా ఈ తరహాలో ప్రారంభమైన స్నాతకోత్సవాన్ని తర్వాతి బ్యాచ్‌లకు కూడా కొనసాగించాలని భావిస్తున్నామన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన

ప్రకాశం నగర్: గృహవినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 కేంద్రం పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం శ్యామల సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.417 ఉన్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1,155కు పెరిగిందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ జమలు రెండు సంవత్సరాల నుంచి నిలిపివేసిందన్నారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్య కుదించిందన్నారు. వాణిజ్య సిలిండరుపై ఒక్కసారిగా రూ.350 పెంచడం వల్ల చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కేంద్రం వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన



గిరిజన ఆశ్రమ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బొమ్మూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో గురువారం గర్భస్థ శిశులింగ నిర్ధారణ (పీసీపీఎన్‌డీటీ) చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఏఎంఓ ఎన్.సత్యకుమార్ మాట్లాడుతూ బేటీ బచావో కార్యక్రమాన్ని ఈనెల 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. బాలికలు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రియదర్శిని, ధవళేశ్వరం పీహెచ్‌సీ సీహెచ్‌సీ శేషామణి, ఎడ్యుకేటర్ రాంబాబు, ఎంపీహెచ్ఎస్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, డైట్ ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆర్జేడీ తనిఖీలు



విద్యార్థులను బైజూస్ ట్యాబ్ వినియోగంపై ఆరా తీస్తున్న ఆర్జేడీ నాగమణి

గోకవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వీరలంకపల్లిలోని వెలుగు బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారికి తల్లిదండ్రులు దగ్గర లేని లోటు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరుశాతం తక్కువ ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట రాజమహేంద్రవరం డీవైఈఓ ఎం.తిరుమలదాసు, కొయ్యలగూడెం డీవైఈఓ ఎం.రామన్నదొర, గోకవరం ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పెదకొండేపూడి చింతాలమ్మ చెరువును పరిశీలిస్తున్న డ్వామా ఏడీపీ శ్రీనివాస్

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం పనులకు కూలీలను పెంచాలని డ్వామా ఏపీడీ జి.శ్రీనివాస్ సూచించారు. నాగంపల్లి, చీపురపల్లి, చినకొండేపూడి, పెదకొండేపూడిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో కె.రమేష్ పాల్గొన్నారు. ఏపీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ నాగంపల్లి, చీపురపల్లి, చినకొండేపూడి పంచాయతీ పరిధిలోని పెదకొండేపూడి, కూనవరంలో అమృత్ సరోవర్‌లోని చెరువుల అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో కొత్త పనులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.గోషవేణి, జూనియర్ ఇంజినీర్ అంజని కుమార్, టీఏ చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు రాంబాబు, నగేష్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: ముగ్గళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రమోహన్ తెలిపారు. బొబ్బిల్లంక, కాటవరం, జాలిమూడి, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, సీతానగరం, రఘుదేవపురం, రాపాక, చినకొండేపూడి, సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

అనపర్తి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో 33/11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 3వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో మండలంలోని దుప్పలపూడి, అనపర్తి పంచాయతీ ఏరియా, కెనాల్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, బుల్లియ్యగారితోట, షారోనుపురం, రామదమ్మపేట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నందరాడలో ఉపాధి కూలీల ధర్నా



నందరాడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

రాజానగరం: మండలంలోని నందరాడలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు సంబంధిత సూపర్ వైజర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేపట్టి కొద్దిసేపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సూపర్‌వైజర్ దారా శ్రీను వ్యవహారశైలిని నిరసిస్తూ ఉపసర్పంచ్ డి.అప్పారావు, 12వ వార్డు సభ్యుడు ఆర్.కన్నారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎ.హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేశారు. దీనిపై ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అగస్టీన్ కుమార్‌ను వివరణ కోరగా.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి



గొల్లపాలెంలో మాట్లాడుతున్న పెట్టా శ్రీనివాస్, పంపన సుబ్బారావు

కాజులూరు: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసే దిశగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల గృహ సారథుల కమిటీ పరిశీలకుడు పంపన సుబ్బారావు అన్నారు. గురువారం మండలంలో వారు పర్యటించి కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేశారు. గొల్లపాలెం గ్రామ సచివాలయంలో శ్రీనివాస్, సుబ్బారావు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగలేదన్నారు. సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు, వలంటీర్లతో సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు జొన్నకూటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు పితాని శివ, మాత బోస్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన ఎండలు.. నర్సరీల్లో అవస్థలు

- మొక్కల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ
- పెరిగిన నీటి వినియోగం



మొక్కలకు మోటారు ద్వారా నీటి సరఫరా

కడియం: వేసవి పూర్తిస్థాయిలో రాకుండానే ఎండలు మండిపోతున్నాయి. దీంతో నర్సరీ రైతాంగం ఆందోళన చెందుతోంది. జనవరి నెలాఖరునుంచే ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా శివరాత్రి వెళ్లాక ఎండల తీవ్రత పెరగడం ప్రారంభిస్తుంది. అటువంటిది నెల రోజుల ముందుగానే తీవ్రంగా ఎండ వేడిమి, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో మొక్కలను కాపాడుకునేందుకు నర్సరీ రైతులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు.

ముందుగానే ఎండలు..

ఎండల తీవ్రత నుంచి విలువైన మొక్కలను కాపాడుకునేందుకు సాధారణంగా పాలీహౌస్, గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేస్తారు. మరికొన్ని మొక్కల రక్షణకు అవిసెగింజలను నాటుతారు. అవిసె మొక్కలు ఏపుగా పెరిగి కిందనున్న నర్సరీ మొక్కలకు ఎండతీవ్రత నుంచి రక్షణనిస్తాయి. ఎండ తీవ్రత పెరగడానికి నెల రోజుల ముందే అవిసె గింజలను నాటుతారు. తద్వారా తీవ్రంగా ఉష్ణోగ్రతలు పెరిగే నాటికి అవిసె మొక్కలు ఎదుగుతాయి. అయితే ఇప్పుడిప్పుడే అవిసె గింజలను రైతులు నాటుతున్నారు. ఈసారి ఎండలు ముందుగానే రావడంతో చాలామంది రైతుల అంచనా తప్పింది. దీంతో ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించుకునేందుకు రోజు విడిచి రోజు నీటిని అందించాల్సి వస్తోంది.

ప్రత్యేక శ్రద్ధ

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నర్సరీ రైతులు మొక్కలను రక్షించుకోవడానికి దాదాపు ఒక యుద్ధం చేస్తారు. ప్రతిరోజూ పెరిగిపోయే ఎండ నుంచి మొక్కలను రక్షించుకునేందుకు నానా అగచాట్లు పడుతుంటారు. ఏమాత్రం నీటిని అందించడం ఆలస్యం చేసినా, మొక్కలు చనిపోతాయి. దీంతో చంటిపిల్లల మాదిరిగా ప్రతిరోజూ అన్ని మొక్కలను పరిశీలిస్తారు. మరోవైపు అధిక విద్యుత్ వినియోగం కారణంగా తరచూ విద్యుత్ లైన్లు కూడా ట్రిప్ అవుతుంటాయి. అప్పటికప్పుడే ఇంజిన్లను ఏర్పాటు చేసుకునైనా మొక్కలకు నీరు అందించాలి. ఇతర దేశాలు, చల్లటి ప్రదేశాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ అభివృద్ధి చేస్తున్న మొక్కల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే వేల రూపాయల విలువైన మొక్కలను కోల్పోవాల్సి ఉంటుంది.

నీరు పెట్టకపోతే నష్టమే

వేసవి వచ్చిందంటే నర్సరీ రైతులకు ఆందోళన ఉంటుంది. మొక్కల ఎదుగుదల ఈ సీజన్‌లోనే బాగుంటుంది. అయితే తగినంత నీటిని ఇవ్వకపోతే మాత్రం నష్టపోవాల్సిందే. రోజు విడిచి రోజు నీరు అందించాల్సి వస్తోంది. జనవరి 20 తేదీ నాటికే ఎండల తీవ్రత బాగా పెరిగింది. రాత్రానను ఇంకా పెరుగుతోంది. ప్రస్తుతం నడివేసవిలో ఎలా ఉంటుందో ఎండ ఆస్థాయిలో ఉంటోంది.

– ఎస్. శ్రీనివాసరావు, నర్సరీ రైతు, కడియపులంక